# ఏడుకొండలవాడు

"నాకు ఒంటో ఉసుల్లేదని అమ్మగారితో చెప్పరాదూ?"

"సెప్పానే, అమ్మగోరు నామాట ఇంటేగందే?"

"ఎంగిలిసెయ్యి కాక్కి ఇసరని మా ఇల్లాలు తిరపతి పోయి ఏం చేస్తదంట?"

"అదిగాదే. అయ్యగారికి ఢిల్లీలో ఏదో పెద్ద ఉద్దేగం అయిందంటే."

"ఇక్కడ ఉద్దేగం వదిలేత్తుండారా ఏంది?"

"ఇదీ ఉంటాదంట, అదీ ఉంటాదే."

"ఇదేందిరోయ్ మా సిత్తరంగా మాటాడుతున్నావ్? రెండు ఉద్దేగాలు ఎట్టా సేత్తారంట?"

"అది అందరూ సేసే ఉద్దేగం కాదే! అయ్యగోరు అప్పుడప్పుడూ పోయి వత్తుంటే సాలంటే. అక్కడ అయ్యగోరికి పెద్ద బంగాలాకూడా ఇచ్చిండ్రంటే."

"నీ కెట్లా తెలుసూ?"

"అది పెద్దమ్మాయిగోరు సెప్పేరు."

"మా మిడిసి పడుతుంటాది అదేనా?"

"పెద్దోళ్ళను అట్టా అనకూడదే. ఆరి ఉప్పుతిని బతకాల్సినోళ్ళం. ఇస్వాసం ఉంచాలే."

"మా పెద్దోళ్లులే! ఇంత శాకిరీ సేత్తావే. ఆళ్ళకు ఇస్వాసం ఉండొద్దా!"

"అదంతా పోనియ్యే! ఇప్పుడేఁ సెయ్యమంటావో సెప్పె!"

"అమ్మతో సెప్పు మా అడదానికి ఒంటో ఉసల్లే దని. ఇయ్యాలో రేపో అంటుందని సెప్పు.

"సెప్పానే. సెడామడా తిట్టేరు. దేవుడు కాడికి రాటానికి ఇన్నోంకలు సెపుతావంటరా? అందుకనే ఇట్లా సత్తున్నారు.' అన్నారే అమ్మగోరు. నేనేం సెయ్యనే సెప్పు.' నువ్వు లేకపోతే ఒచ్చే పురుడు ఆగదులే అన్నారు."

"ఆ తల్లికి కనికారం లేదు. ఇంకా గొప్పోళ్ళే అయిపోతుండారు. ఆ దేవుడేఁ సేత్తన్నాడో తెలవదు."

"ఊరుకోయే. మరీనిగత్తే, నీ నోరు మా సెడ్డదయిపోతాది."

"నేను రానని అమ్మగోరితో సెప్పు. నేనిట్టా ఉంటే ఎట్టా ఎల్తావ్? నాకు యనక వోరున్నారు సూసుకోడానికి? ఈ గండం ఎట్టా గడుత్తాదో బయంగా ఉండాది. ఆ ఏడు కొండలో...."

"ఛీ, నోరుముయ్యే. అదేం మాటే? అసలే ఒంటూపిరి దానివని నేను దిగులడి సత్తుంటే! ఎల్లుండి

సందాళకంతా ఒచ్చేత్తాగా. అందాకా సూసుకోమని మాణిక్యంతో సెప్పిపోతానే."

"ఎక్కడన్నా సావు. నాకు బూమ్మీద నూకలు నిండుకున్నాయిలే. పో సచ్చినోడా"!

గుడిసె బయటికి వస్తున్న వెంకాయి చెవులకు రామి మాటలు ములుకల్లా గుచ్చుకున్నాయి. ఒక్క నిమిషం నిలబడిపోయాడు. కళ్ళలో నీరు తిరిగింది. వెనకకు తిరిగి లోపలికి ఒక అడుగు వేసినవాడు మళ్ళీ ఏదో గుర్తొచ్చినట్లు తిరిగి బయటికి వెళ్ళాడు. ముందు జారివున్న చూరుబొంగు నొసటికి పొడుచుకుంది. దిమ్మెర పోయిన తలను చేత్తో నొక్కుకుంటూ వెళ్ళిపోయాడు.

వెంకాయి కాళ్ళీడ్చుకుంటూ దిగులు దిగులుగా వచ్చి రత్తమ్మముందు నిల్చున్నాడు. అందానికి ఏమాత్రం ఆశ్రయాన్ని ఇవ్వనని ప్రతిజ్ఞ పట్టిన ఆమె ఆకారం ముందు వణుకుతూ నిల్చున్నాడు వెంకాయి. కోడి గుడ్లలాగ పైని అతికించినట్లుండే ఆ కళ్లు కోపంతో ఎరుపెక్కి బయటికి దూకటానికి ప్రయత్నిస్తున్నాయి.

"ఇంత సేపూ ఎక్కడ చచ్చావురా?" రత్తమ్మ గొంతులో మాటలు గరగరలాడాయి. కళ్లు హుంకరించాయి. ఆమె తన కళ్ళతోనూ, శరీరంతోనూ భయపెట్టాల్సిందే కాని, ఆ పూడి వుండే గొంతులోనుండి శబ్దం పైకిరాదు. సాధారణంగా అందం లేని వాళ్ళలో హృదయ సౌందర్యం ఉంటుందంటారు. కాని రత్తమ్మ

విషయంలో మాత్రం పెద్దలు పొరపడ్డారనే చెప్పాల్సి వస్తుంది. ఆమె బాహ్యరూపం, అంతస్స్వరూపానికి ద్యోతకమే కాబట్టి అట్టే ఎవరూ మోసపోవటమంటూ జరగదు.

రత్తమ్మ భర్త ప్రపంచం దృష్టిలో ప్రయోజకుడైనా, దేశ నాయకుడుగా ప్రఖ్యాతి గాంచినా, యం. పి. అయినా, ఆ ఊళ్ళోవాళ్లు మాత్రం రత్తమ్మ భర్తగానే గుర్తిస్తారు. రత్తమ్మ తన భర్త ప్రయోజకత్వానికి కారణం తనేననీ, తనలాంటి గృహిణి లభించటం వల్లనే ఏ డిగ్రీలు లేకపోయినా ఇంతటివాడు అయాడనీ నమ్మకం. రత్తమ్మ భర్తకూడా ఆ సత్యాన్ని గ్రహించడం వల్లనో మరెందుచేతనోగానీ, తన వ్యక్తిత్వాన్ని పూర్తిగా అంకితం చేశాడనే చెప్పాల్సివస్తుంది. తనకు అన్యాయమనీ, తప్పు అనీ తోచిన విషయాల్లో కూడా ఆమెకు అనుకూలంగానే ప్రవర్తిస్తాడు. ఏమైతేనేమి తన భార్య అదృష్టం వల్లనే తను కలలోకూడా ఊహించని కీర్తి శిఖరాలను అధిరోహిస్తున్నాననీ, తిండికి ఎలా గడుస్తుందా అని ఆలోచించవలసిన తను ఓ లక్ష రూపాయలన్నా వెనక వెయ్యగలిగాననీ, రత్తమ్మ భర్త నమ్మకం.

రత్తమ్మ కొలువులో రోజుకో వంటవాడూ, పని మనిషీ మారాల్సిందే. అతి మంచివాళ్ళయితే ఒక వారం కంటే ఎక్కువుండరు. చేసిన కష్టఫలితాన్నికూడా వదులుకొని పారిపోతూంటారు. ఇదంతా చూస్తున్న రత్తమ్మకు

మానవజాతి మీదనే నమ్మకం పోతుంది. వినయ విధేయతలూ, విశ్వాసం, కృతజ్ఞతా మొదలైన శబ్దాలను డిక్షనరీనుంచి తొలగించలేదేమా అని రత్తమ్మకు ఆశ్చర్యం. ఇంకా కొంతమంది తనలాంటి వాళ్లుకూడా ఉండి ఉంటారేమో అందుకే ఆ శబ్దాలను యింకా ఉపయోగిస్తున్నారని ఆమె మళ్ళీ సరిపెట్టుకుంటుంది.

వెంకాయి గత ఆరు సంవత్సరాలుగా రత్తమ్మగారింట్లో పనిచేస్తున్నాడు. ఆ విషయం విన్న ప్రతి వాళ్ళకూ ఆశ్చర్యమే. తమ వ్యక్తిత్వాలను ప్రపంచానికి చాటుతూ, విర్రవీగుతూ నిల్చుని ఉండే మహా వృక్షాలను సైతం కూకటి వేళ్ళతో పెకలించి, అట్టహాసం చేస్తూ ముందుకు సాగిపోయే భయంకర ఝంఝామారుతానికి తన వినయ విధేయతలు చూపుతూ, ఆ మహా శక్తిముందు తలవంచి నిలబడి వుండే దుబ్బు మొక్కకు ఏ భయమూ లేదు. వెంకాయి జీవితంకూడా అలాగే గడిచిపోతూ వుంది. అనటం అమ్మగారి హక్కు, పడటం తన కర్తవ్యం అనే భావాన్ని వెంకాయి బాగా జీర్ణం చేసుకున్నాడు. కాని యీరోజు వెంకాయిలోని జడత్వాన్ని కూడా భార్య అన్న ఆ చివరి మాటలు కదిలించాయి. అమ్మగారితో తిరుపతికి రానని చెప్పటానికి నిశ్చయించుకొని వచ్చాడు. కాని యజమానిరాలి ఉగ్రరూపం ముందు మూగపశువై పోయాడు.

“ఏరా అలా చూస్తావు? ఆ ముఖాన్ని బొప్పి ఏఁవిటి? త్వరగా సామానులు సర్దు.” అంటూ నవ్వటానికి ప్రయత్నించింది యజమానురాలు. వెంకాయికి యజమానురాలి కోపముఖంకంటే నవ్వుముఖమంటేనే ఎక్కువ భయం. ఎప్పుడూ పెదాలు బిగించి, కనుబొమ్మల్ని ఎత్తి ఉంచే ఆమె ముఖంలో ఎప్పుడో కాని నవ్వు కన్పించదు. ఆమె నవ్వు చాలా అసహజంగా, అమంగళకరంగా కనిపిస్తుంది వెంకాయికి.

నొసటి బొప్పిని సవరించుకుంటూ సామాను సర్దటానికి లోపలికి వెళ్లాడు. అయ్యగారితోనైనా తన స్థితి చెప్పుకుందామనుకున్న వెంకాయి, భార్య కోపంగా ఉండటం చూచి ఇప్పుడే వస్తానంటూ బయటికి వెడుతున్న తన యజమాని వంక జాలిగా చూచాడు.

అందర్నీ హెచ్చరించి అమ్మగారూ, అయ్యగారూ, చిన్న బిడ్డను మాత్రం తీసుకొని బండి ఎక్కారు. పెద్ద కూతురికి ఆరో మాసం. జాగ్రత్తగా చూచుకోమని మరీ మరీ రత్తమ్మ పెద్దకూతురుని హెచ్చరించింది. “మొదటి కాన్పు. అసలే పిల్ల బలహీనంగా ఉంది. తరువాత ఏమనుకుంటే ఏఁవిటి? ఈ రెండు రోజులూ లేడీ డాక్టర్ని ఇంటికి వచ్చి చూచుకు పొమ్మని కబురు పంపు పెద్దబ్బాయిచేత.” అంటూ రత్తమ్మ మరీ మరీ హెచ్చరించి బండెక్కింది. రత్తమ్మ మాటలు వెంకాయి హృదయాన్ని మరీ మరీ బాధించాయి. బండి వెనుక నడుస్తూ, బండి దూరమయి

నప్పుడు మధ్య మధ్య పరుగెత్తి కలుసుకుంటూ ఉన్న వెంకాయి హృదయం మాత్రం కళ్ళెంలేని బలిసిన గుర్రం లాగ వెనక్కు పరుగెత్తుతూ ఉంది.

పెద్దమ్మాయిగారు బలహీనంగా ఉన్నారని తన యజమానురాలు హెచ్చరించింది. వెంకాయి కళ్ళముందు తన భార్య రూపం, రత్తమ్మ పెద్దకూతురి రూపం కన్పిం చాయి. వెంకాయి గుండెలు ఎక్కడికో జారిపోతు న్నట్లనిపించింది.

"ఏంవిట్రా నీ ఆలోచనా నువ్వూనూ? త్వరగా సామాను దింపు." అమ్మగారి స్వరం వెంకాయి చెవుల్లో గర గర లాడింది.

"బస్సుకు డబ్బులు దండుగ. వీణ్ణి కొండెక్కి రమ్మ నండి." అంది రత్తమ్మ భర్తతో.

వెంకాయి ప్రాణాలు లేచివచ్చాయి. తననుకూడా కొండమీదికి బస్సులోనే రమ్మంటారేమోనని ఇంతవరకూ భయపడుతున్నాడు. వాళ్ళ అమ్మ అంటూ వుండేది. "కలికాలం వెంకటేశ్వర పెరుమాళ్ళ దర్శనంకూడా బస్సులో పోయి చేసుకోవటం ఏమిటి? కొండ ఎక్కి వెళ్ళితే ఆ ఫలితం దక్కుతుంది" అని. వెంకాయి దొరికిన అవకాశాన్ని పోగొట్టుకోకుండా నడిచి వెళ్ళటానికి ఉత్సాహపడ్డాడు. రత్తమ్మకి వాడి వాలకం సంతోషాన్ని కలిగించింది. పావలా వాడి చేతిలో పెట్టి ఏమయినా

కొనుక్కు తినమని చెప్పింది. బస్సుకు పెట్టాల్సిన రూపాయి పావలాలో రూపాయి మిగిలినందుకు సంతోష పడి భర్తవంక మురిపెంగా చూచింది "నేను ఎంత పొదుపుగా సంసారం నెట్టుకొస్తున్నానో చూచావా?" అన్నట్టు. తన భార్య ఏ క్షణంలో ఎందుకు ప్రసన్నం అవుతుందో, ఏ క్షణంలో ఎందుకు ఉగ్ర రూపాన్ని ధరిస్తుందో ఈ యిరవై సంవత్సరాల దాంపత్య జీవితంలో అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూ పల్టీలు కొడుతూనేవున్నాడు రత్తమ్మ భర్త. మేధావిగా పేరు పొందిన రత్తమ్మ భర్త తన భార్యముందు వెర్రి వెంగళాయిలాగ ముఖం పెడతాడు. ఈ మధ్య ఆవిడ ఆగ్రహానికి గురికాకుండా మౌనంతో నెట్టుకొస్తున్నాడు. ఆమె ప్రతి మాటనూ చిరునవ్వుతో ఆలకిస్తూ ఉంటాడు.

"ఇంకా బస్సు అర్ధగంటకు గాని కదలదు. నువ్వు వెళ్ళరా. త్వరగా రా. మేము స్నానాలవీ ముగించుకొని సత్రంనుంచి గుడికి వస్తాం. నువ్వు తిన్నగా అక్కడికే రా." అన్నది రత్తమ్మ.

ఆ అవకాశంకోసమే ఎదురు చూస్తున్న వెంకాయి గిరుక్కున వెనక్కు తిరిగాడు. "ఏడుకొండలవాడు ఆ కొరతకూడా తీరిస్తే మళ్ళీ త్వరగా వచ్చి దర్శనం చేసుకుందాం." అంటున్న రత్తమ్మ మాటలు వెనక్కి తిరిగిన వెంకాయి చెవుల్లో గింగురుమన్నాయి.

ఏడుకొండలవాడి దయవల్ల ఆ కొరతకూడా తీరాలా! అమ్మగారికి ఇంకా ఏ కొరత వుందో ఎంత ఆలోచించినా వెంకాయి బుర్రకు అందటం లేదు. ఆ ఏడు

కొండలవాడి దయవల్ల తన భార్య అగండం గడిచి బయటపడితే! తనెంత దద్దమ్మ! ఏడుకొండలవాడు వెంకట రమణుడి దర్శనం చేసుకోటానికి వస్తూకూడా పిచ్చి పిచ్చి ఆలోచనలు ఆలోచిస్తున్నాడు. అంతా ఆ పెరుమాళ్ళే చూచుకుంటాడు. తనెందుకు భయపడాలి? ఇలా ఆలోచిస్తూ కొండ ఎక్కుతున్న వెంకాయికి చిన్నతనంలో చూచిన వెంకటేశ్వర మహాత్యం సినిమా జ్ఞాపకం వచ్చింది. తను ఇక్కడుంటే మాత్రమేం? ఏడుకొండలవాడు అక్కడికి వెళ్ళి తన భార్యను రక్షించలేడా ఏం?

ఇలా ఆలోచిస్తూ, రొప్పుకుంటూ 'ఏడుకొండలోడా! ఎంకటరమణా! అని అరుస్తూ కొండ యెక్కుతున్నాడు.

కడుపు దహించుకు పోతూవుంది. నాలిక పిడచ కట్టుకు పోతూవుంది. నెత్తీ, కాళ్ళూ మాడుతున్నాయి. ఒక చెట్టు నీడను చేరాడు, అరటిపళ్ళూ, బెల్లపు చెరుకులూ అమ్ముతున్నాయి. మొలలో చెయ్యిపెట్టి పావలా తీశాడు. మళ్ళీ వెంటనే, ఈ పావలా ఖర్చు పెట్టుకుంటే ఆ దేవుడికి కానుక ఏం వేస్తాడు? ఇంతదూరం వచ్చి పావలా అయినా ఉండీలో వెయ్యకపోతే ఎలా? అనుకుంటూ మళ్ళీ వెంటనే ఆ పావలా మొలలో దోపుకున్నాడు. పళ్ళు బిగించి, రొప్పుతూ, బలవంతంగా కాళ్ళను ఎత్తి ఒక్కొక్క మెట్టుమీదా పెడుతూ ఎక్కుతున్నాడు. శరీరం బరువెక్కినా మనస్సు మాత్రం చాలా తేలిగ్గా,

ఉత్సాహంగా ఉంది. వచ్చే యీ రోజు నాటికి-తనూ-తన భార్యా-కొడుకూ - ఆలోచనలు బుర్రలో అల్లరి చేస్తున్నాయి.

వెంకటేశ్వరస్వామి ముందు నిల్చున్న వెంకాయి భక్తి పారవశ్యంలో మునిగిపోయాడు. రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు. చేతులు జోడించటానిక్కూడా వీల్లేదు. తన యజమాని కొడుకుని ఎత్తుకొని నిలబడ్డాడు. తన యజమానురాలు అభిషేకం చేయిస్తూవుంది. అంతా అయిన తరువాత తన మెడలోని పది నవర్సుల గొలుసు తీసి చేతిలో పట్టుకొని ఏదో గొణిగింది. అమ్మగారు ఏదో వరం కోరుకుంటున్నా రనుకున్నాడు వెంకాయి. కాని ఆ గొలుసు ఎందుకు చేత్తో పట్టుకున్నారో అర్థం కాలేదు. అలా రెండు నిమిషాలు ఏదో జపం చేసి అంత లావు గొలుసూ ఆ ఉండీలో వేసింది. వెంకాయికి తన జన్మలో ఎప్పుడూ అంత ఆశ్చర్యం కలగలేదు. పిల్లికి బిచ్చం వెయ్యని తన యజమానురాలు అమ్మో! ఇంత బంగారం ఎలా వేసిందో !

తన దగ్గ రేముంది స్వామికి సమర్పించటానికి? చిన్న మెత్తు బంగారంకూడా లేదే! స్వామి తన వంక ఆగ్రహంగా చూస్తున్న ట్లనిపించింది వెంకాయికి. వణుకుతున్న గొంతుతో ఏదో గొణిగాడు. వచ్చే సంవత్సరం ముగ్గురూ-కొడుకూ-భార్యా - తనూ వచ్చి తలనీలాలు

ఇస్తామని మొక్కుకున్నాడు, మొలలో దోపిన పావలా చెయ్యిపెట్టి తీశాడు. కాసు వెయ్యలేకపోయినా పావలా కాసు వేస్తున్నాను కదా అని తృప్తి పడ్డాడు.

వెంకాయి ఏమేదో ఉండీలో వెయ్యటం రత్తమ్మ చూచింది. వెంకాయికూడా దాన్ని గ్రహించి సిగ్గు పడుతూ బయటికి దారి తీశాడు. సత్రం చేరుకొని అమ్మ గారు పెట్టిన వెంకటేశ్వరస్వామి ప్రసాదం కళ్ళకద్దుకొని తిన్నాడు. కడుపు దహించుకు పోతూవుంది. కొంత తిని కడుపునిండా నీళ్లుతాగి మిగిలింది అంగవస్త్రంలో భార్య కోసం మూట కట్టుకున్నాడు.

బస్సులో ఎక్కుతున్న రత్తమ్మ ముఖం వెల వెల పోయింది భర్తను కొంచెం పక్కకు పిలిచి అన్నది: "అబ్బాయి వేలి ఉంగరం లేదు."

"ఆఁ ఏమవుతుంది? యింటిదగ్గర పెట్టినట్లు గుర్తేనా?" అన్నాడు రత్తమ్మ భర్త నిర్లక్ష్యంగా.

"మాబాగా అడుగుతున్నారు! వచ్చేటప్పుడు అమ్మాయిని అడిగి తీసుకొని వాడి వేలికి పెట్టింది నేను కదూ?" అన్నది రత్తమ్మ ముఖం చిట్లించుకుంటూ.

"ఏమయి ఉంటుంది?" అన్నాడు మెత్తదనాన్ని స్వరంలోకి తెచ్చుకుంటూ రత్తమ్మ భర్త.

"ఇంకా ఏమవుతుంది? ఆ గాడిదే తీసి వుంటాడు. అందుకే యీ అలగా జాతిని నమ్మవద్దో అని నెత్తి నోరు పెట్టుకొని చెబుతుంటాను." అని ఆక్రోశించింది రత్తమ్మతల్లి.

"సరి! ఇప్పుడు మాట్లాడకు. ఇంటికి వెళ్ళిన తర వాత వాడి పని చెబుతాను." అన్నాడు భార్యను తృప్తి పరిచే ధోరణిలో. కాని వెంకాయి తీసి ఉంటాడని అంత త్వరగా నమ్మలేకపోయాడు రత్తమ్మ భర్త.

"వాణ్ణికూడా మనతోనే బస్సులో తీసుకెడదాం. కాస్తా కూస్తా, ముప్పాతిక సవరను బంగారం ఉంది." అన్నది రత్తమ్మ.

తన భార్య దగ్గరికి రెక్కలు కట్టుకొని వాల్దా మన్నంత అదుర్దాగా ఉన్న వెంకాయి అమ్మగారు తన కూడా బస్సులో రమ్మనటం ఆ ఏడుకొండలవాడి దయే అనుకున్నాడు. అమ్మగారు నిజంగా తను అనుకున్నంత చెడ్డది కాదు అనుకున్నాడు వెంకాయి. బస్సుకంటే వేగంగా వెంకాయి ఆలోచనలు ఇంటివైపుకు పరుగెత్తు తున్నాయి. మధ్య మధ్య ఏవో మధుర భావాలు హృద యంలో చక్కలిగింతలు పెడుతుంటే నవ్వుకుంటున్నాడు. కళ్ళముందు పసిపాపను ఒళ్ళో పెట్టుకొని తృప్తిగా, సిగ్గుగా తన కళ్ళలోకి చూస్తున్న భార్య రూపం-చెవుల్లో పిల్లవాని కార్-కార్ మనే ఏడుపు.

* * *

బండిలోనుండి సామాను దింపి తొందర తొంద రగా ఇంట్లో సర్ది వెంకాయి "అమ్మగోరూ, నేను ఇంటి కెల్తానండి" అన్నాడు.

ఇంటికి వెళ్ళటానికి పడే వాడి ఆదుర్దా చూచి రత్తమ్మ భర్తకు కూడా వాడే ఉంగరం తీసి ఉంటాడని నమ్మకం కలిగింది.

"ఏంరా గాడిదా! పిల్లవాడి చేతి ఉంగరం ఏంఐయింది?"

వెంకాయి హృదయానికి కొరడాదెబ్బ తగిలింది. ముఖంమీద సిరా అలుముకుంది. కళ్ళప్పళించి చూస్తున్నాడు. ఏదో అనాలనుకున్నాడు కాని ఆ మాట లేవో లోపలే ఉండిపోయాయి.

"ఏంరా అలా చూస్తావు? పక్క ఎముకలు విరగ తన్నించినా పాపంలేదు." రత్తమ్మ హుంకరించింది.

"నాకు తెల్దమ్మ గోరూ, ఆ ఏడుకొండలోడి తోడు."

"ఛీ నోరు ముయ్యి వెధవా" అంటూ 'ఇంకా అలా దద్దమ్మలా చూస్తావేం' అన్నట్లు రత్తమ్మ కళ్లు ఆమె భర్తను రెట్టించాయి.

వెంకాయికి చెమట్లు పోశాయి. కళ్లు తిరుగుతున్నాయి. నీళ్లు నిండివున్న ఆ కళ్ళలో రత్తమ్మ నవ్వు ముఖం-రత్తమ్మ భర్త ఉగ్రరూపం-లాఠీలు తిప్పుతూ యమభటుల్లా పోలీసులూ-చేతుల్లో బిడ్డను పట్టుకొని పాలిపోయి, అలిసిపోయి, పడవలేని, మాట్లాడలేని స్థితిలో తన భార్య-బంగారు తొడుగులతో, రత్నాల ఆభరణాలతో, వెండి కళ్ళతో నిప్పులు కక్కుతున్న ఆ వెంక

శ్వేశ్వరస్వామీ....ఒక దృశ్యం తరవాత ఒకటి రంగుల రాట్నంలాగా గిర గిర తిరిగాయి.

నిల్చున్న చోటనే కుప్పలాగ కూలబడ్డ వెంకాయికి పోలీసు వాన్ శబ్దంకాని, వాళ్లు లోపల ప్రవేశించటం గానీ ఏమీ తెలియదు. బలంగా వీపుమీన పడ్డ లాఠీ దెబ్బకు వెంకాయి ఎముకలగూడు మూల్గింది. పోలీసుల బూట్ల కొత్త నాడాలు వెంకాయి గుండెలమీద శివతాండవం చేశాయి.

"చెప్పరా! ఉంగరం తీశావా లేదా?" ముక్కుమీద బలంగా తగిలిన బూటుదెబ్బకు బొలబొల నెత్తురు కారింది.

"కొట్టకండి బాబయ్యా, తీశాను." ముక్కునుంచి కారే రక్తాన్ని చేత్తో తుడుచుకుంటూ అన్నాడు. పోలీసులిద్దరూ ముఖంమీద చెమటను తుడుచుకుంటూ రత్తమ్మ వంకా, రత్తమ్మ భర్తవంకా చూచారు విజయగర్వంతో.

"నేను చెప్పలేదూ?" అన్నట్టు తన తెలివికి తనే మురిసిపోతూ చూచింది రత్తమ్మ భర్తవైపు.

"తీసి ఏం చేశావురా? ఎక్కడ పెట్టావు?" అన్నాడు రత్తమ్మ భర్త వెంకాయితో.

వెంకాయి తల వంచుకున్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడు.

"ఏంరా మాట్లాడవ్?" పోలీసుల లాఠీ అడిగింది.

కాని వెంకాయి మాట్లాడలేదు.

"వీడు గుళ్ళో ఉండీలో ఏదో వేయటం నేను చూచాను." అన్నది రత్తమ్మ.

రత్తమ్మ, రత్తమ్మ భర్త, పోలీసులు ఒకళ్ళ ముఖాలు ఒకళ్లు చూచుకున్నారు.

"అత్తసొమ్ము అల్లుడు ధారపోశాడట. వెధవ! ఉంగరం దొంగతనం చేసి స్వామికి వేస్తావా? ఇవ్వాళ ఇదయింది రేపు ఇంకొకటి అవుతుంది. ఈ జాతే ఇంత. వీళ్ళను రామ రామ అనకూడదు." అంటూ ఏదో లెక్ప రిస్తున్న ధోరణిలో చెప్పుకుపోయింది రత్తమ్మ.

ఈ గొడవ ఏమిటో చూట్టానికొచ్చిన పక్కింటి జానకి: "పోనీలెండి. దేవుడికి పెట్టింది వృథాపోదు. ఆసొమ్ము మీ దేకాబట్టి మీ లెక్కలోనే జమకట్టుకోవాలని ఆ ఏడు కొండలవానికి తెలియదా ఏంవిటి?" అన్నది.

రత్తమ్మ హుంకరించింది, "అందరూ మమ్మల్ని చూచి కళ్ళలో నిప్పులు పోసుకొనేవాళ్ళే" అంటూ. రత్తమ్మ నోటిసంగతి తెలిసిన జానకి ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ, దెబ్బలతో మాంసం ముద్దలా పడివున్న వెంకాయిని ఒక్కసారి చూచి వెళ్ళిపోయింది.

వెంకాయిని పోలీసులు వాన్ ఎక్కించారు. ఒక్క సారి తన భార్యను చూడనివ్వమని బతిమాలాడు. పోలీసు వాన్ వెంకాయి గుడిసెముందు ఆగింది. వెంకాయి హృదయం అజ్ఞాత భయంతో గజగజ లాడిపోయింది. వాకిట్లో

అడుగు పెడుతూనే పక్కింటి మాణిక్యం, మంత్రసానీ కన్పించారు. వాళ్ళ ముఖాలుచూచి వెంకాయి కాళ్లు ఆగిపోయాయి.

మాణిక్యం అన్నది. "రాత్రిరేళనుంచి బాధపడి పోతున్నాది. ఇంకా పురుడు రాలేదు. దక్కుతాదో లేదో !"

వెంకాయి రామిపక్కన కూర్చున్నాడు. రామి ఒక్కసారి మూలిగి జాలిగా వెంకాయి కళ్ళలోకి చూచింది. వెంకాయి వణుకుతున్న చేతుల్లో రామితలను తీసుకున్నాడు.

"తొందరగా రా." అంటూ లోపలి కొచ్చిన పోలీసును చూచి మాణిక్యం, మంత్రసానీ, భయంగా లేచి నిలబడ్డారు.

వెంకాయి చిన్నగా రామి తలను తన ఒడిలో నుంచి కిందపెట్టి కళ్లు మూసుకొని ఉన్న రామివైపు జాలిగా చూచి బయటికి వచ్చాడు. వెంకాయి పెదవుల మీద వెలిసిన చిరునవ్వుకు పోలీసులు ఆశ్చర్యపోయారు. ఆత్మహత్య చేసుకోబోయే ముందు ప్రపంచపు పోకడ చూచి నవ్వే నవ్వులాగ ఉంది వెంకాయి చిరునవ్వు.

• • • •

"ఏమండీ ! కొంచెం ఇలా రండి." రత్తమ్మ ఏదో ఆలోచిస్తూ వరాండాలో కూర్చొని వున్న భర్తను కేక వేసింది.

లోపలికి వెళ్ళిన భర్తతో యాధాలాపంగానే అన్నది రత్తమ్మ: "అయ్యో! నా తెలివి తెల్లారా! ఆ ఉంగరం నా 'బాగ్' లోనే ఉందండి. సత్రంనుంచి గుడికి వెళ్లేముందు ఒదులుగా ఉంది, ఎక్కడయినా పోతుందని తీసి 'బాగ్' లో వేశాను. తరవాత గుర్తే లేదు. నామతి మండిపోనూ !"

రత్తమ్మ భర్త ముఖంమీద ఓ అజ్ఞాత హాస్తం మసి పులిమింది. నల్లబడ్డ ముఖంతో, విసుక్కున్నాడు. "చాలా గొప్ప పని చేశావు !" ఇప్పుడు వెళ్ళి పోలీసు స్టేషన్‌లో ఏ ముఖం పెట్టుకొని ఉంగరం ఇంట్లోనే ఉందని చెప్పను! పాపం, వాణ్ణి అనవసరంగా జైల్లో వేస్తారు." అన్నాడు.